క్లుప్తంగా

ఇంద్రకీలాద్రిపై సంకటహర చతుర్థి ప్రత్యేక పూజలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థి పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో కొలువై ఉన్న జగన్మాత శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి తెలుగు మాసంలో వచ్చే సంకటహర చతుర్థి రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో ఆగమ శాస్త్రాలకు అనుగుణంగా దేవస్థానం స్థానాచార్యులు, వైదిక కమిటీ సభ్యులు విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతి హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజా సామగ్రితో ఆరాధనలు చేసి స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు.

16 నుంచి హరికథ సప్తాహ మహోత్సవాలు

విజయవాడకల్చరల్: హరికథ పితామహుడు మద్దాడ ఆదిభట్ల నారాయణదాసు 161వ జయంతి సందర్భంగా సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు హరికథ సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తునట్లు కార్యక్రమ కన్వీనర్ బుర్రా పద్మనాభశాస్త్రి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ ఉదయం నేమాని నాగలక్ష్మి పార్వతీ పరిణయంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ప్రతి రోజు ఉదయం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హరికథ భాగవతులు హరికథలను గానం చేస్తారన్నారు. 17న ఆదిభట్ల నారాయణదాసు సాహితీ గోష్ఠి, 22న ఆదిభట్ల నారాయణదాసు జయంతి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

40 మంది మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 40 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 40 మందిపై ఐదో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. 40 మందిని కోర్టులో హాజరుపరచగా, ఆరో అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి లెనిన్‌బాబు 13 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 27 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు.

దేశభక్తిని చాటేలా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశభక్తిని చాటి చెప్పేలా మువ్వన్నెల జెండాలను చేతపట్టుకుని బీజేపీ ఊర్మిళానగర్ మండల అధ్యక్షుడు పగడాల కృష్ణ ఆధ్వర్యంలో విద్యాధరపురం కబేళా వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఉర్దూ) నుంచి కబేళా సెంటర్ వరకు మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సన్నాహక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ర్యాలీలో కళాశాల, వివిధ పాఠశాలల విద్యార్థినులు పాల్గొని భారత్ మాతాకు జై, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. స్వాతంత్ర్య సముపార్జనకు త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకున్నారు. దేశ సరిహద్దులలో అశువులు బాసిన వీర సైనికులకు సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎన్.మధుకర్, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, శ్రీనివాస రాజు, నున్న కృష్ణ, బాషా, ప్రసాద్, సురేష్, శ్రీదేవి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఉర్దూ కళాశాల విద్యార్థినులు

దేశభక్తిని పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతీ ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలని.. దేశానికి తమవంతు సేవలు అందించాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణకాంత్ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తిరంగా ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ దేశం మనకు ఏమి ఇచ్చిందని కాకుండా దేశానికి మనం ఏం చేశామని ప్రశ్నించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు త్రివర్ణ పతాకం చేతబూని నినాదాలు చేస్తూ ఏలూరు రోడ్డు చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం విభాగాల్లో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థులు

నగరంలో 'పరదా' చిత్ర యూనిట్ సందడి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): 'పరదా' చిత్ర ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ మంగళవారం నగరంలో సందడి చేసింది. స్థానిక సత్యనారాయణపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వేడుకలో కథనాయిక అనుపమ పరమేశ్వర్ చిత్ర విశేషాలను వివరించారు. లేడీ ఓరియంటెడ్ పాత్రలో మొదటిసారి నటించే అవకాశం రావటం సంతోషంగా ఉందన్నారు. దర్శకులు ఈ చిత్రం కథ గురించి చెప్పగానే ఎంతో ఎమోషనల్ అయ్యానని, అంతే కష్టపడి నటించినట్లు తెలిపారు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని థియేటర్లలో మాత్రమే చూసి తమను ఆదరించాలని కోరారు. ఈ నెల 22న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలన్నారు. చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ హీరో రామ్‌చరణ్ చేతుల మీదుగా పరదా చిత్రం ట్రైలర్ లాంచ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి మనిషికి మాస్క్ అనేది ఉంటుందని, ఆ మాస్కును తొలగిస్తే మనిషి జీవితం ఎలా ఉంటుందో చూపించేదే ఈ చిత్రమని చెప్పారు. చిత్రంలో సీనియర్ నటీనటులు రాజేంద్రప్రసాద్, గౌతమ్ మీనన్ ముఖ్య పాత్రలు పోషించారన్నారు. చిత్ర విశేషాలను నిర్మాతలు విజయ్, శ్రీనివాస్ పంచుకున్నారు.



చిత్ర విశేషాలను పంచుకుంటున్న పరదా చిత్ర యూనిట్

సెమీ కండక్టర్స్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సెమీ కండక్టర్స్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ జి.శశాంక్‌దాస్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఐక్యూఏసీ, ఐఈఐ స్టూడెంట్ చాప్టర్, విద్యుత్ క్లబ్ తదితర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'అప్లికేషన్స్ అండ్ కంట్రోల్ స్ట్రాటజీస్ ఫర్ సెమీ కండక్టర్ డివైసెస్ ఇన్ కరెంట్ సినారియో'' అంశంపై మంగళవారం కళాశాల సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశాంక్‌దాస్ మాట్లాడుతూ సెమీకండక్టర్ పరికరాలు, పవర్ ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, ఆటోమేషన్ కమ్యూనికేషన్ వంటి రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ రంగంలో ప్రస్తుతం ఉపయోగిస్తున్న నియంత్రణ వ్యూహాలు, కొత్త సాంకేతిక ధోరణుల గురించి వనరుల వినియోగం తదితర అంశాలపై సుదీర్ఘ ప్రసంగం చేశారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వారివారి రంగాలకు సంబంధించిన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎస్ రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సెమీ కండక్టర్స్‌పై వివరిస్తున్న డాక్టర్ శశాంక్‌దాస్

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించాలి

వించిపేట(విజయవాడపశ్చిమ): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించాలని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపేటలోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్‌లో పెన్షనర్లతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని అర్హతలు ఉన్నా అనేక కారణాలు చూపిస్తూ అర్హులకు పెన్షన్ ఇవ్వకపోవడంతో వృద్ధులు, వికలాంగులు మనోవ్యధకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే ఒకరు మరణిస్తే మరొకరికి ఇస్తామని చెప్పి, రెండు, మూడు నెలలు అవుతున్నా పెన్షన్ ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వికలాంగుల పెన్షన్ విషయంలో సదరం సర్టిఫికెట్‌లో మోసాలు జరిగాయని, రీవెరిఫికేషన్ పేరుతో పెన్షన్‌లు నిలిపివేయడం దుర్మార్గమని అన్నారు. అధికారులు సత్వరమే రీవెరిఫికేషన్ చేసి అర్హత ఉన్న వికలాంగులకు పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శివర్గ సభ్యురాలు గాదే ఆదిలక్ష్మి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు బంగార్రాజు, కె.సూరిబాబు, షేక్ ఆమీర్, దోగుపర్తి సుబ్బరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యబాబు

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ సర్కిల్–1 పరిధిలోని ఖుద్దూస్‌నగర్ ట్విన్ ట్యాంక్ రిజర్వాయర్ వద్ద ఇన్‌లెట్ 350 ఎంఎం డయా స్లూయజ్ వాల్ మరమ్మతులు గుర్తైందని, దీన్ని మార్చేందుకు కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్ణానందంపేట, పెజ్జోనిపేట, ఖుద్దూస్‌నగర్, కేదారేశ్వరరావుపేట, లోటస్‌ల్యాండ్ మార్క్, అయోధ్యనగర్, రామలింగేశ్వరపేట, శాంతినగర్‌లో బుధవారం సాయంత్రం నీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని స్థానికులు ముందుగానే నీటిని నిల్వచేసుకోవాలని సూచించారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి మోసం చేశాడని ఓ యువతి భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడి మైలురాయి కరకట్ట డౌన్‌కు చెందిన యువతి బీకాం కంప్యూటర్స్ పూర్తి చేసి ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. ఆమె ఇంటర్ చదివే సమయంలో కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో కోచింగ్‌కు వెళ్లే సమయంలో శింగరాజు కోటేశ్వరరావు పరిచయం అయ్యాడు. ఆమెతో చనువుగా మెలిగాడు. ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పాడు. ప్రలోభ పెట్టి శారీరకంగా లొంగదీసుకున్నాడు. తనకు ఫ్రూట్ షాపు ఉందని, దానిని అభివృద్ధి చేసేందుకు డబ్బులు కావాలని ఆమె వద్ద రూ.11లక్షలు తీసుకున్నాడు. ఆమె బంగారం తనఖా పెట్టాడు. యువతి డబ్బుతోనే బైక్ కొన్నాడు. కొంతకాలం నుంచి ఆమెను దూరం పెడుతూ వచ్చాడు. కులం పేరుతో దూషించడమే కాకుండా ఆమెను అనరాని మాటలు అన్నాడు. ఈ క్రమంలో ఒక రోజు కబేళా సెంటర్‌లోని అతని ఇంటికి వెళ్లగా వేరే మహిళతో ఉన్నాడు. ఎవరని నిలదీస్తే తాను ఏడాది క్రితమే పెళ్లి చేసుకున్నానని చెప్పాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన యువతి భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదకర ఫెన్సింగ్‌లకు మరమ్మతులు చేయండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రమాదకరమైన, పాడైపోయిన ఫెన్సింగ్‌లకు త్వరగా మరమ్మతులు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం కెనాల్ రోడ్, విద్యాధరపురం, కుమ్మరిపాలెం సెంటర్, అంబేద్కర్ రోడ్డు, ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ విద్యాధరపురంలో గల అవుట్‌ఫాల్ డ్రైన్ ను పరిశీలించి, నిరంతరం డీసిల్టింగ్ పనులను చేస్తుండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజినీర్ (వర్క్స్)పి.సత్యనారాయణ, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



అవుట్‌ఫాల్ డ్రైన్ వద్ద ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటానికి మాలలు సిద్ధం కావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ దళితుల ఐక్యతను దెబ్బతీసే అతిపెద్ద రాజకీయ కుట్ర అన్నారు. వర్గీకరణకు నాటి కాంగ్రెస్ పార్టీ హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో బీజం వేసిందని, నేడు అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం వర్గీకరణను దేశవ్యాప్తం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందలో కేవలం నలుగురికి లబ్ధి కలిగే ఎస్సీ వర్గీకరణ ఫలాలు దేశవ్యాప్తంగా ఎస్సీ జాబితాలో ఉన్న 1108 కులాలకు మోదీ ప్రభుత్వం, తెలుగు రాష్ట్రాల్లోని 59 కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఏ విధంగా పంచుతారని ప్రశ్నించారు. ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని నిలదీశారు. వర్గీకరణ వ్యతిరేక పోరాటానికి మద్దతు ప్రకటించాలని కోరారు. సమావేశంలో మాల మమానాడు నాయకులు కొప్పుల ప్రేమ్ బాబు, తుమ్మల ఫ్రాన్సిస్, కాకర రవితేజ, కూసి కొండబాబు, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ధర్నా

జోనల్ వర్క్‌షాప్ వద్ద ప్లకార్డులతో ప్రదర్శన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ పరంగా, సంస్థ పరంగా ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు చేపట్టిన ధర్నా కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు మంగళవారం విద్యాధరపురంలోని జోనల్ వర్క్‌షాప్ వద్ద ప్లకార్డులతో ధర్నా చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నాన్ ఆపరేషన్ కార్యదర్శి ఎస్.కల్యాణ్ కుమార్, స్టోర్స్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరాజు, వర్క్‌షాప్ అధ్యక్ష , కార్యదర్శులు ఎస్.స్వామి, సీహెచ్ శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు జి.జార్జ్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, వేతన సవరణ అయిపోయి ఇప్పటికే రెండేళ్లు పూర్తయినందున వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు.



వర్క్‌షాప్ ముందు ధర్నాలో ఆర్టీసీ ఉద్యోగులు

బైక్‌ను ఢీకొట్టిన కాలేజీ బస్సు

ఇద్దరు యువకులకు గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కాలేజీ బస్సు బైక్‌ను ఢీకొని ఇద్దరు యువకులు గాయపడిన ఘటన కనకదుర్గ ఫ్లై ఓవర్‌పై కుమ్మరిపాలెం సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... కంచికచర్ల గ్రామానికి చెందిన పైరాడ రాకేష్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితుడు యాదాల నవీన్‌తో కలిసి పనిమీద ఏలూరు వెళ్లారు. ఏలూరు నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో కనకదుర్గ ఫ్లై ఓవర్‌పై కుమ్మరిపాలెం సెంటర్ వద్దకు చేరుకున్నారు. వెనుక నుంచి వేగంగా వచ్చిన కాలేజీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న నవీన్, బండిపై ఉన్న రాకేష్ కింద పడిపోయారు. ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు గొల్లపూడిలోని ఆంధ్రా హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. నవీన్ తలకు గాయం కావడంతో మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. రాకేష్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏఐహెచ్ఆర్‌పీ కౌన్సిల్ జిల్లా వైస్ చైర్‌పర్సన్‌గా ఖాసీంబీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆలిండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఎన్టీఆర్ జిల్లా ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్ వైస్ చైర్‌పర్సన్‌గా గొల్లపూడి పంచాయతీ పరిధిలోని రామరాజ్యనగర్‌కు చెందిన షేక్ ఖాసీంబీ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకుడు/సీఈఓ షేక్ సిరాజుద్దీన్ మంగళవారం గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో ఖాసింబీకి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖాసీంబీ మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సంస్థ సీఈఓ సిరాజుద్దీన్ సహకారంతో వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

సహజ నటి వాణిశ్రీ

విజయవాడకల్చరల్: సహజ నటి వాణిశ్రీ అని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై మంగళవారం వాణిశ్రీ జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ.. వాణిశ్రీ నటనను భావి నటీమణులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ మాట్లాడుతూ.. స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటి వాణిశ్రీ అని అభివర్ణించారు. సినీ నటి వాణిశ్రీ ఫోన్ ద్వారా పంపిన సందేశాన్ని నిర్వాహకులు వినిపించారు.